క్లుప్తంగా

కాలుష్య వ్యర్థాలతో మత్స్యకారుల జీవనోపాధికి ముప్పు

కొత్తపల్లి: తీరప్రాంతంలో కాలుష్య పరిశ్రమలు ఏర్పాటు చేసి వ్యర్థాలను పైపులైన్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేయడం వలన మత్స్యకారుల జీవనోపాధికి ముప్పు వాటిల్లుతోందని మత్స్యకార సంఘం నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో బుధవారం తీరంలో పరిశ్రమల ఏర్పాటుపై మత్స్యకారులు సమావేశం నిర్వహించారు. తీరప్రాంతంలోని పరిశ్రమలు వ్యర్థాలను పైపులైన్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేయడం వలన మత్స్య సంపద అంతరించిపోతుందన్నారు. అలాగే మత్స్యకారులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని భయాందోళనలు వ్యక్తం చేశారు. తీరంలో కాలుష్య పరిశ్రమల నిర్మాణం నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రాలు సమర్పిస్తామని మత్స్యకార నాయకులు కారే శ్రీనివాసరావు, ఉమ్మిడి చిన్న తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు కొర్ని రమణ, కంబాల దాసు, పల్లేటి బాపన్న దొర, కొర్ని శ్రీను, ఉమ్మిడి అప్పారావు, గంపల తాతారావు, అర్జిల్లి నాగేశ్వరరావు, ఎరిపల్లి దేవుడు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ



సర్పంచ్ ఎలీషాను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: మండలంలోని పాత ఇసుకపల్లి సర్పంచ్ సన్నిబోయిన రిబ్కా ఎలీషా తండ్రి నూకరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఏలీషా, అతని కుటుంబ సభ్యులను బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు గింజాల శ్రీనివాసరావు, నాగులాపల్లి ఎంపీటీసీ అనిశెట్టి సుభాషిణి, పార్టీ నాయకులు ఏడిద పెద్దతల్లి, గొర్ల పోతన్న, గుర్రాల నూకాలు తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షతల పంపిణీ



గొల్లప్రోలులో అయోధ్య రాముని అక్షతలు పంపిణీ చేస్తున్న భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో బుధవారం ఇంటింటికీ అయోధ్య రాముని అక్షతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, భజన బృందాల సభ్యులు గొల్లప్రోలు రైల్వే స్టేషన్ వద్ద వేంచేసిన వేంకటేశ్వరస్వామి, పాదాలమ్మతల్లి, కనకదుర్గాదేవి, ఆంజనేయస్వామి, రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి అక్షతలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలో గడప గడకూ అక్షతలు పంపిణీ చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని అందజేస్తున్న వీర్రాఘవరావు

పెద్దాపురం: మహిళా శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఆయన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ చల్లా రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. పిల్లలతో రోజూ వ్యాయామం చేయించాలని, పౌష్టికాహారాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఐఈఆర్టీలు నాగగోవింద, నారాయణరావు పాల్గొన్నారు.

సమరానికి సై..

- పందేలకు సిద్ధమవుతున్న కోళ్లు
- తర్ఫీదు ఇస్తున్న శిక్షకులు
- సంప్రదాయ క్రీడగా గుర్తించాలంటున్న ఔత్సాహికులు



వీకే రాయపురంలో సంక్రాంతి పందేల కోసం సిద్ధంగా ఉన్న కోడి పుంజులు

సామర్లకోట: సంక్రాంతి పండగ అనగానే గుర్తొచ్చేవి గంగిరెద్దులు, హరిదాసు, గొబ్బిళ్లు, రంగవల్లులు, కొత్తబట్టలు వగైరా.. వీటితో పాటు మరో పార్శ్వమూ ఉంది కదా.. అదేనండీ కోడి పందేలు, గుండాటలు వగైరా.. మరి వీటిని జూదంగా పరిగణించి సర్కారు వారు ఏటా నిషేధిస్తున్న విషయం తెలిసిందే. అయినా అలవాటైన సరదా.. ఊరికే ఉంటుందా.. వేలాది మంది వీక్షిస్తుండగా, వందలాది మంది పందేలు కాస్తుంటే.. రూ.లక్షలు, రూ.కోట్లలో పందేలు పలుకుతుంటే.. ఆ బరిలో కోళ్లు సర్రున కత్తులు దూస్తుంటే.. చూడాల్సిందే.. చెప్తే ఆ కదనంలో మజా తెలీదు. ఇదిగో రోజుల్లోకి వచ్చేసింది సంక్రాంతి పండగ. పోలీసుల కళ్లు గప్పి గుట్టుగా బరులు సిద్ధమవుతుండగా, కోళ్లు కదనానికి సిద్ధమవుతున్నాయి. చివరి నిమిషంలోనైనా పోలీసు అధికారులు నిర్ణయం మార్చుకుని లేదా చూసీ చూడనట్టు కళ్లు మూసుకుంటారన్న ఆశతో పందేనికి సర్వం సిద్ధమైపోతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే కోడి పందాలకు కత్తులు కట్టే వారిని పోలీసులు బైండోవర్ చేశారు. సంప్రదాయంగా జరుగుతున్న పండగలకు అనుమతి ఇవ్వాలని స్థానిక ప్రజా ప్రతినిధులు చోటా నాయకులు ఇప్పటికే ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తున్నారు.



పందెం పుంజులను వేడి నీటితో మాసాజ్ చేస్తున్న పెంపకందారులు



సంక్రాంతి సందడిని గుర్తు చేస్తూ సై అంటే సై అంటున్న కోడి పుంజులు

డ్రై ఫ్రూట్స్‌తో పందెం కోడి పుంజులు తయారు...

సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో లేని ఆహారాన్ని పందెం కోళ్లకు వేసి మేపుతున్నారు. పుంజులు బలంగా తయారు కావడానికి మేక మాసం కైమా, కోడిగుడ్లు, జీడి పప్పు, నెత్తలు, ఖర్జూరం, బాదం పప్పు, కిస్‌మిస్ వేసి మరీ పెంచుతున్నారు. వీటితో పాటు నిత్యం ఒక రకమైన ఆకు కూరలు కూడా పందెం పుంజులకు వేసి తయారు చేస్తున్నారు. వాటిని నీటిలో వదలి ఈత కొట్టించడం, నీటిలో మరిగించి ఆ నీటితో పుంజులను మసాజ్ చేయిస్తూ సమరానికి సిద్ధం చేస్తున్నారు. పందెం కోళ్లకు సంబంధించి రంగులను బట్టి డేగ, నెమలి, పచ్చకాకి, చెవల, చేతువ, రసంగి, కక్కిరాయి, నల్ల కక్కిరాయి, గౌడు పేరుతో పిలుస్తుంటారు. వేట్లపాలెం, జి.మేడపాడు, వీకే రాయపురం, ఉండూరు గ్రామాల్లో కోడి పందేలకు నిర్వాహకులు సిద్ధం అవుతున్నారు.

తాతల కాలం నుంచి కోడి పుంజుల పెంపకం.....



వీకే రాయపురం గ్రామంలో సుమారు 60 ఏళ్లుగా మా తాతల కాలం నుంచి పాల డెయిరీ, కోడి పుంజులు, ఇటుకల బట్టీని పొలంలో నిర్వహిస్తున్నాం. సుమారు 100 పుంజుల వరకు తయారు చేస్తున్నాం. సంక్రాంతికి మూడు నెల ముందు నుంచి కోడి పుంజులను తయారు చేస్తాం. రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు పుంజు ధర ఉంటుంది. కోడి పందేలు పూర్వం నుంచి ఆనవాయితీగా జరుగుతున్నాయి. సంక్రాంతికి మూడు రోజులు కోడి పందాలను ఒక క్రీడగా తీసుకుని అనుమతి ఇవ్వాలి.

– తలారి దొరబాబు, కోడి పుంజుల పెంపకం దారుడు, వీకే రాయపురం

సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం



సంక్రాంతి సందర్భంగా సంప్రదాయ క్రీడలు ఆడుకునేలా ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పిస్తున్నాం. ఈ మేరకు కబడ్డీ, ఖోఖో, క్రికెట్ వంటి క్రీడలను ప్రోత్సహిస్తున్నాం. కోడి పందాల నిర్వాహకులు, కోళ్లకు కత్తులు కట్టే వారిని ఇప్పటికే బైండోవర్ చేశాం.

– డి.సురేష్, సీఐ, సామర్లకోట

శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పిఠాపురం: మాస శివరాత్రిని పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చేకూరి వీరబాబు, దత్తు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు వైద్య శిబిరం

సామర్లకోట: మండల పరిధిలో కాపవరం గ్రామంలోని బ్రిడ్జి వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోప్ ఫర్ టుడే సేవా సంస్థ నిర్వాహకులు వి.ఇమ్మానియేల్, ఎస్.సుబ్రహ్మణ్యం, ఎస్.రాంబాబు, ఆర్.మునేశ్వరరావు, ఎం.దొరబాబులు తెలిపారు. శిబిరంలో కంటి, దంత, ముక్కు, చెవి, ఎముకలు, స్త్రీల గర్భకోశ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా

- మండల స్థాయి పోటీలు ప్రారంభం
- క్రీడాకారులకు క్రీడా కిట్లు పంపిణీ



బాలికల కబడ్డీని ప్రారంభించిన దవులూరి సుబ్బారావు

సామర్లకోట: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడలు బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలో దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, మండల పరిధిలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ యువతలోని క్రీడా స్ఫూర్తిని వెలికి తీయడానికి ఈ క్రీడలు దోహద పడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడా కిట్లను అందజేశారు. మండల స్థాయిలో స్త్రీ, పురుషుల కబడ్డీ, మున్సిపాలిటీ పరిధిలో క్రికెట్ టోర్నీలు ఉత్సాహంగా జరిగాయి. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, పీడీ వెంకటేశ్వరరావు, మేనేజరు అచ్యుతరాజు, కౌన్సిలర్ పాలిక కుసుమ చంటి, పిట్టా సత్యనారాయణ, మర్రి శేషారావు, ఎంపీడీఓ డి శ్రీలలిత, ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, జెడ్పీటీసీ ఎలిశెట్టి అమృతనరేష్, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యువతకు ప్రభుత్వ ప్రోత్సాహం

పెద్దాపురం: వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే గత మెన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం.. ఆంధ్రా క్రీడలు నిర్వహిస్తున్నట్టు జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడలు బుధవారం మండలంలోని రాయభూపాలపట్నం గ్రామంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగిన పోటీల్లో జెడ్పీటీసీ సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, పీఏసీఎస్ అధ్యక్షులు నల్లల నాగేంద్రబాబు, పరిమి శ్రీను, ముత్యాల రాజబ్బాయి, సర్పంచ్‌లు చీకట్ల లక్ష్మి, కనపర్తి చీమదొర, ఒబిలిశెట్టి అబ్బాయి , ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, నల్లల గోవింద తదితరులు పాల్గొనారు.

ప్రతిభను వెలికితీసేందుకే..

కొత్తపల్లి: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని జెడ్పీటీసీ గబ్బుల తులసీకుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులకు మండలస్థాయి, జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన వారికి ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. జెడ్పీటీసీ తులసీకుమార్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఇంతగా క్రీడలను ప్రోత్సహించలేదన్నారు. ప్రతీ సచివాలయానికి క్రికెట్, వాలీబాల్, షటిల్ క్రీడా పరికరాలను అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, ఎంపీడీఓ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేస్తున్న దవులూరి సుబ్బారావు, కమిషనర్



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీలు సూరిబాబు, సత్యవతి



కొత్తపల్లిలో మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

వ్యవసాయ పనులకు ఉపాధి హామీ అనుసంధానం

- పిఠాపురం మండల సమావేశంలో ఎంపీ వంగా గీత
- గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

కొత్తపల్లి: వ్యవసాయ పనులకు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని కేంద్రాన్ని కోరినట్టు కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత తెలిపారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిఠాపురం మండల పరిధిలో ఉపాధిహామీ పథకానికి సంబంధించి రూ.14 కోట్లు ఖర్చు చేయగా వాటిలో రూ.10 కోట్లు కూలీలకు వేతనాలుగా చెల్లించారన్నారు. మిగిలిన రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో హార్టీ కల్చర్ ద్వారా పూలతోటల పెంపకానికి నిధులు వెచ్చిస్తారన్నారు. గతంలో ఉపాధి పనులకు రెండు పూటలా మస్తరు వేసేవారని, ప్రస్తుతం ఒకసారే వేసేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు గాను కొత్త చెరువుల తవ్వకాలకు గ్రామస్తుల అనుమతులు తీసుకుంటున్నట్టు తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లతో పాటు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నట్టు చెప్పారు. పలువురు ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో ప్రజల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బడ్జెట్‌లో రూ.4.70 కోట్ల పనులకు ఆమోదం తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ చెన్నారావు, వైస్ ఎంపీపీ ఊటా వెంకట సత్యనారాయణ, పలురువు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆర్టీసీలో డయల్ యువర్ డీఎం

కాకినాడ: కాకినాడ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేశారు. పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ప్రభాకరరావు ఫోన్ చేసి పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద అన్ని దూర ప్రాంత సర్వీసులకు స్టాప్ ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ విషయమై వెంటనే తగు చర్యలు తీసుకుంటామని డీఎం హామీ ఇచ్చారు. కాకినాడ ఆర్టీవో ఆఫీస్ మీదుగా సామర్లకోట, పిఠాపురం పట్టణాలకు బస్సులు నడపాలని కాకినాడ శశికాంత్ నగర్‌కు చెందిన ఎస్.శ్రీనివాస్, ఇలా పలువురు ఫోన్ చేసి సమస్యలు తెలియజేశారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు



పెద్దిపాలెం అటవీప్రాంతంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలోని గ్రామాల్లో బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించి 45 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్ఈబీ (సెబ్) సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలోని సారా స్థావరాలపై దాడులు చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి 30 లీటర్ల సారాతో పాటు సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ ఘటనలో ఎదురి అప్పన్నదొర అలియాస్ వీరబాబుపై పరారీ కేసు నమోదు చేశామన్నారు. కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురంలో గుబ్బల ఆదినారాయణను అదుపులోకి తీసుకుని, అతని నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్, అరటి పళ్ల విక్రయానికి వేలం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో సైకిల్ స్టాండ్, అరటిపండ్లు, కొబ్బరి కాయల విక్రయానికి ఈనెల 24న ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. సైకిలు స్టాండ్ వద్ద రుసుం వసూలు చేసుకోవడానికి రూ.రెండు లక్షల ప్రధమ ధరావతు, రూ.10 లక్షల సాల్వెన్సీ, కొబ్బరి, అరటి పండ్ల విక్రయం దుకాణానికి రూ.లక్ష ప్రధమ దరావత్తు, రూ.ఐదు లక్షల సాల్వెన్సీ, ఆలయంలో కొబ్బరి చిప్పలు తీసుకు వెళ్లడానికి ప్రధమ ధరావతు రూ.లక్ష, సాల్వెన్సీ రూ.ఐదు లక్షలు, ఆలయ ఆవరణలో ఏడాది పాటు మామిడి చెట్ల ఫల సాయం పొందడానికి ప్రధమ ధరావత్తు రూ.రెండు వేలు, సాల్వెన్సీ రూ.50 వేలు చెల్లించి 24వ తేదీ మధ్యాహ్నం 11 గంటలకు జరిగే పాటలో పాల్గొన్నాలన్నారు. పాటలో పాల్గొనే వారు రూ.వెయ్యి చెల్లించి టెండర్ షెడ్యూల్‌ను ఈనెల 22వ తేదిలోగా కొనుగోలు చేసుకోవాలన్నారు.

22న మాంసం దుకాణాలు తెరవొద్దని వినతి



గోకవరంలో మాంసం దుకాణదారులకు వినతి పత్రం అందజేస్తున్న సమితి సభ్యులు

గోకవరం: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఈ నెల 22న ప్రతి ఒక్కరూ మాంసాహారానికి దూరంగా ఉండాలని సనాతన ధర్మ ప్రబోధన సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం గోకవరంలోని మాంసం దుకాణాదారులకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తోట సాయిబాబా మాట్లాడుతూ ఆయోధ్యలో ఈ నెల 22న జరిగే శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ రోజున మాంసాహారన్ని త్యజిద్దామన్నారు. ఆ రోజు మాంసం దుకాణాలు తెరవద్దని ఇప్పటికే దుకాణకారులను కోరామని తెలిపారు. కార్యక్రమంలో దోసపాటి సుబ్బారావు, కందుల శ్రీరామారావు, గంద్రెడ్డి సన్యాసిరావు, పిల్లంగోరు పాపారావు, ఆదం మణికంఠ, తాటికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న శ్రీనివాస్

పెద్దాపురం: స్థానిక మట్టే వారి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవి క్లబ్, లలితా ఇండస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్కాలర్‌షిప్పులు పంపిణీ చేశారు. పారిశ్రామికవేత్త, దాత, లలితా రైస్ ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం 150 మందికి రూ.7.5 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లను ఆయన పంపిణీ చేశారు. మట్టే ఆదీష్‌బాబు, గ్రంధి గోపాల్, శ్రీరామ్ ప్రకాష్, వాసవి క్లబ్, యువజన సేవా సంఘం సభ్యులు, ఆర్యవైశ్య సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హుండీల ద్వారా రూ.28 లక్షల ఆదాయం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.28,16,208 ఆదాయం లభించిందని కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. బుధవారం దేవదాయ ధర్మదాయశాఖ పెద్దాపురం తనిఖీ అధికారి సీహెచ్ ఉదయబాబునాయుడు, కాకినాడ గ్రేడ్–2 కార్యనిర్వహణ అధికారి వి.సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తల పర్యవేక్షణలో హుండీలను తెరచి నగదు లెక్కించామన్నారు. 60 రోజులకు నాణేలు రూ.89,643, నోట్లు 27,26,565 మొత్తం రూ.28,16,208 సమకూరిందన్నారు. బ్యాంకు అధికారులు, శ్రీవారి సేవకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సౌరశక్తి సుస్థిర అభివృద్ధిపై సదస్సు

బాలాజీచెరువు: అన్నవరం సత్యవతీ దేవి మహిళా డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సౌరశక్తి సుస్థిర అభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జర్మనీ కొలంబో వర్సిటీ అధ్యాపకులు పంపన వెంకటేష్ హాజరై శిలాజ ఇంధన వాడకాన్ని నిలిపివేయడంతో పాటు అవసరమైన పునరుత్పాదక ఇంధనాలైన సౌరశక్తి వైపు మానవాళి మళ్లవలసిన అవశ్యకతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సువర్చల, క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్ నిర్వాహకులు ఎం.వసంత, అధ్యాపకులు సంజోత, భౌతికశాస్త్ర ఇన్‌చార్జి సూర్యనారాయణ పాల్గొన్నారు.